## నేటి నుంచి రైతుబజార్‌కు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

**కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):** హైటెక్‌సిటీ రోడ్డులోని కూకట్‌పల్లి రైతుబజార్‌కు నీటి సరఫరా సరిపోవడం లేదు. దీంతో ఎస్టేట్ ఆఫీసర్ కందిమళ్ల సుధాకర్‌రావు గత నెలలోనే జలమండలి జీఎం అంబటి ప్రభాకరరావుకు వినతిపత్రం అందజేశారు. నీటి సరఫరా జరగని రోజు రెండు ట్యాంకర్లు అవసరం అవుతాయని వాటిని డొమెస్టిక్ కేటగిరీలో ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై గత వారం మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పుష్పారెడ్డి కూడా ఫోన్‌చేసి ప్రభుత్వ రైతుబజార్‌కు నిబంధనలు పెట్టకుండా రైతుల గొంతు తడిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈనెల 14 నుంచి రైతుబజార్‌కు అవసరాన్ని బట్టి డొమెస్టిక్ కేటగిరీలో నీటిని పంపిస్తామని జలమండలి జీఎం హామీ ఇచ్చినట్లు రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ తెలిపారు.

## వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

- కూకట్‌పల్లి డీఈ జేఎల్ జనప్రియ, ఏడీఈ ప్రసాద్

**కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** వేసవిలో ఎలాంటి అవాంతరాలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని టీజీఎస్‌పీడీసీఎల్ కూకట్‌పల్లి డీఈ జేఎల్ జనప్రియ, ఏడీఈ ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్కడైనా ఏదైనా సమస్య ఉంటే కంట్రోల్ రూమ్ లేదా ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు 24/7 సమాచారం అందించాలని సూచించారు. లైన్‌మన్‌లను కాలనీ, బస్తీ వాట్సాప్ గ్రూపుల్లో యాడ్ చేసుకోవచ్చన్నారు. ఫోన్ ద్వారానే కాకుండా వాట్సాప్ ద్వారా కూడా సేవలను పొందవచ్చన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 1912కు కూడా సమాచారం ఇవ్వొచ్చు.

- జేఎల్ జనప్రియ, కూకట్‌పల్లి డీఈ - 9440813132.
- బి.ప్రసాద్, కూకట్‌పల్లి ఏడీఈ- 9440813145.
- చైతన్య, కూకట్‌పల్లి సెక్షన్ ఏఈ- 9440813156, ఫ్యూజ్ ఆఫ్ కాల్, కూకట్‌పల్లి- 949010177.
- దయానంద్, భాగ్యనగర్ కాలనీ సెక్షన్ ఏఈ- 9440813158, ఫ్యూజ్ ఆఫ్ కాల్, భాగ్యనగర్- 9490610179.
- పీరు నాయక్, ఆల్విన్ కాలనీ సెక్షన్ ఏఈ- 9491067618, ఫ్యూజ్ ఆఫ్ కాల్, ఆల్విన్‌కాలనీ-8331041820.

## నేడు జనసేన పార్టీ 12వ ఆవిర్భావ వేడుకలు

**అల్లాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):** జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహిస్తామని ఆ పార్టీ ప్రతినిధి దుట్ట రవీంద్రనాథ్ ఠాగూర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 7:30 నిమిషాలకు మోతీనగర్ క్రాస్‌రోడ్స్‌లోని మహనీయుల విగ్రహాలకు జనసేన పార్టీ నేతలు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. కబరీనగర్, పాండురంగానగర్ కాలనీల్లో జెండా ఆవిష్కరణ, 8 గంటలకు మూసాపేట్ మునిసిపల్ కార్యాలయం వద్ద సీనియర్ నేత ముమ్మారెడ్డి ప్రేమకుమార్ ఆధ్వర్యంలో అల్పాహార విందు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఉదయం 9 గంటలకు అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లో పార్టీ జెండా ఆవిష్కరిస్తారని రవీంద్రనాథ్ తెలిపారు.

## మౌలిక సదుపాయలకు నిధులు కేటాయించండి

- జడ్సీకి జంట సర్కిళ్ల కార్పొరేటర్ల వినతి


జడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

**కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):** మౌలిక సదుపాయల కల్పనకు నిధులు కేటాయించాలని కూకట్‌పల్లి జడ్సీ అపూర్వ్ చౌహాన్‌ను కూకట్‌పల్లి, మూసాపేట్ జీహెచ్ఎంసీ సర్కిళ్ల పరిధిలోని బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు ఆయన కార్యాలయంలో కలిసి వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ల వారీగా ఆయా కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, పార్కులు, శ్మశాన వాటికలు, విద్యుత్ దీపాలు, ఓపెన్ నాలాల సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, పగుడాల శిరీషబాబురావు, సబీహా గౌసుద్దీన్, పండాల సతీష్‌గౌడ్, ఆవుల రవీందర్‌రెడ్డి, ముద్దం నర్సింహయాదవ్, మాధవరం రోజాదేవి, మాజీ కార్పొరేటర్లు పగుడాల బాబురావు, తూము శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బస్తీలో పెండింగ్ పనులను పూర్తిచేయండి


బస్తీ సమస్యలపై స్థానిక నాయకులతో చర్చిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

**బాలానగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** బాలానగర్ డివిజన్ పరిధి దిల్‌కుష్ నగర్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి బస్తీలో పపర్యటించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి ఏఈ ఆశ, డివిజన్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## పేదలకు వైద్య సేవలు అందించాలి


శ్రీసాయి మందిరంలో కార్పొరేటర్ నర్సింహయాదవ్, తదితరులు

**ఓల్డుబోయినపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** పేదలకు వైద్య సేవలు అందించేందుకు మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ సూచించారు. గురువారం సాయికృష్ణకాలనీలోని సాయిమందిర్ ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శ్రీ సాయి అశ్విని పాలీక్లీనిక్ అండ్ డయాగ్నోసిస్ సెంటర్‌ను కార్పొరేటర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ శ్రీ సాయి అశ్విని పాలీక్లీనిక్ నిర్వహకులు పేద ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు వెలకట్టలేనివని అన్నారు.

### ● మహిళలకు సత్కారం




అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా గురువారం కూకట్‌పల్లి అశోక వన్ మాల్‌లో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో మాల్ ఎండీ జైదీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- కేపీహెచ్‌బి కాలనీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి)

### ● పాఠశాలలో హోలీ సంబురాలు


మూసాపేట పరిధిలోని పంచశీల పాఠశాలలో హోలీ సంబురాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా రంగులు చల్లుకున్నారు. ఈ వేడుకల్లో పంచశీల శ్రీనివాస్‌తో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - కూకట్‌పల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి)

### ● కాముని దహనం


హోలీ పండుగను పురస్కరించుకుని కేపీహెచ్‌బీ మలేషియన్ టౌన్‌షిప్‌లో గురువారం రాత్రి కాముని దహనానికి ఏర్పాట్లు చేస్తున్న కాలనీవాసులు
- కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి)

### ● గాయత్రీనగర్ కాలనీలో


అల్లాపూర్ డివిజన్ గాయత్రీనగర్ కాలనీలో గురువారం రాత్రి కాలనీవాసులు కర్రలు, పిడకలను ఒకచోటికి చేర్చి కాముని దహనం క్రతువును నిర్వహించారు.
- అల్లాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి)

# జాజిరి పాటల జాడేది

- హోలీ వేడుకల్లో తగ్గిన సందడి ● నాటి వేడుకల జ్ఞాపకాలే మధురం


జాజిరి ఆడుతున్న బాలురు (ఫైల్)


హోలీ పాటలు పాడుతూ ఆడుతున్న గిరిజన మహిళలు

**బాలానగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** ఒకప్పుడు హోలీ అంటే వారం రోజుల ముందునుంచే సందడి మొదలయ్యేది. శివరాత్రి అనంతరం పౌర్ణమి వెన్నెల ప్రారంభం నుంచి హోలీ సంబరాలు ప్రారంభమవుతాయి. యువకులు, కళాకారులు రాత్రి వేళల్లో ఇంటింటికి తిరుగుతూ జాజిరి పాటలు, ఆటలతో అలరించే వారు. గ్రామ ప్రధాన కూడళ్లలో మృదంగం, డప్పు కళాకారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కోలాటం, నృత్యాలు చేసే వారు జాజిరి కోలాటం ఆటలతో తెలంగాణ ప్రాచీన చరిత్ర, కథలను తెలియజేస్తూ కళాకారులు బహుమతులను అందుకునే వారు. గిరిజన మహిళలు, మరికొంత మంది మహిళలు చప్పట్లతో ఇంటింటికీ వెళ్లి నజరానాలు, గ్రామ పెద్దల నుంచి బహుమతులు స్వీకరించే వారు.

### జ్ఞాపకాలుగానే..

నాటి తరాలు హోలీని కలిసికట్టుగా పెద్దఎత్తున జరుపుకునే వారు. అలాంటి ఉత్సవాలు ఇప్పుడు ఎక్కడా కానరావడం లేదు. దీంతో ఆనాటి హోలీ జ్ఞాపకాలన్నీ కొందరికి మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. ఆ రోజుల్లో సాయంత్రం వేళ కుర్రాళ్లు రెండు కర్రలను చేతపట్టుకుని పాటలు పాడుకుంటూ ఇంటింటికీ వెళ్లి మామూళ్లు పుచ్చుకునే వారు. గిరిజన మహిళలు 10 మంది కలిసి గ్రూపుగా ఇంటింటికి, షాపులకు వెళ్లి పాటలు పాడుతూ పండగ మామూళ్లు వసూలు చేసుకునే వారు. కానీ ఇప్పుడు నగరంలో ఆ సందడే కరువైంది. ఇంకొన్ని రోజులు పోతే ఆనాటి హోలీ వేడుకలను కథలుగా చెబితే వినాల్సి వస్తుందేమోనని నాటి తరాల వారు అభిప్రాయపడుతున్నారు.

### ఆ రోజుల్లో హోలీ సందడే వేరు



మా చిన్నతనంలో హోలీకి వారం రోజుల ముందు నుంచే రంగులు సిద్ధం చేసుకునే వాళ్లం. హోలీ చివరి రోజు జరిగే వేడుకల్లో ఎలాంటి పాటలు పాడాలి, ఎలా ఆడాలి అనే విషయాలపై మా వీధిలో పెద్ద లైటు కింద ప్రాక్టీస్ చేసే వాళ్లం.
- జయేందర్, సీనియర్ కార్మిక నాయకుడు

### హోలీ పాటలు వింటుంటే ఆడాలనిపించేది

ఆ రోజుల్లో హోలీ హోలీల రంగ హోలీ లాంటి పాటలు పాడుతూ ఉంటే ఆడాలనిపించేంది. అప్పుడు ఎలాంటి డప్పు వాయిద్యాలు లేకున్నా కేవలం పాటలు చప్పట్లతోనే హోలీని ఎంజాయ్ చేసే వాళ్లం.
- ఎం.సృజన, ఫతేనగర్

### జాజిరి పాటలు ఇప్పుడు వినపడడం లేదు



హోలీ పండుగ అంటే వారం రోజుల సందడి ఉండేది. మా చిన్నతనంలో వారం రోజుల ముందునుంచే స్నేహితులందరం కలిసి రెండు చిర్రెలు (రెండు కర్రలు) పట్టుకుని జాజిరి పాటలు పాడుకుంటూ ఇంటింటికి వెళ్లి హోలీ శుభాకాంక్షలు తెలుపుకుంటూ నజరానాలు, బహుమతులు అందుకునే వాళ్లం. కానీ ఇప్పుడు జాజిరి జాడే లేదు.
- ప్రవీణ్, బాలానగర్

## తాగునీటి సమస్య పరిష్కరించండి

- వివేకానందనగర్‌తో ఖాళీ బిందెలతో మహిళల నరసన

**అల్లాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):** అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్‌లో నాలుగు రోజులుగా నల్లాల ద్వారా తాగునీరు సరఫరా కవడడంలేదని మహిళలు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ వివేకానందనగర్‌లోని రోడ్ నం.8 లో సమయపాలన లేకుండా, లోప్రెషర్‌తో నీటి సరఫరా చేస్తున్నారని తెలిపారు. దీంతో నిత్యం తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మెరుగైన నీటి సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

# ఎల్‌ఐజీ వెంచర్-2 సమస్యను పరిష్కరించండి


ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న పెద్దిరాజు తదితరులు


కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సూరిబాబు, తదితరులు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జికి వినతి

**కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** కేపీహెచ్‌బీ నాలుగోఫేజ్‌లోని ఎల్‌ఐజీ వెంచర్-2కు హౌసింగ్‌బోర్డు అధికారులు ఫైనల్ నోటీసులు ఇచ్చారు. 2014 నుంచి ఫైనల్ కాస్ట్, వడ్డీ రేట్ల విషయంలో తమకు న్యాయం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. తాజాగా ఫైనల్ నోటీసులు అందుకున్న వారు లబోదిబోమంటున్నారు. అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ చావ రవి, అధ్యక్షులు పెద్దిరాజు, ప్రధాన కార్యదర్శి సూరిబాబు గురువారం కూకట్‌పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌కు వినతిపత్రాలు అందజేశారు. 63శాతం పెంచి నోటీసులు ఇచ్చారని, రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో లోన్లు కూడా తీసుకోలేకపోతున్నామని తెలిపారు. 630 కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని తమకు న్యాయం చేసేందుకు కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఆలయాలను కాపాడుకోవాలి

**బాలానగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):** ఆలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ హిందువుపై ఉందని కూకట్‌పల్లికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డెపల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. గురువారం బాలానగర్ చరబండరాజునగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మొదట స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సమావేశంలో పాల్గొని సభ్యులకు పలు సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న వడ్డెపల్లికి కృతజ్ఞతలు తెలియజేస్తూ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు.


వడ్డెపల్లిని సత్కరించి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

# రోడ్లపై మురుగు పరుగు

- కూకట్‌పల్లి పరిధిలో తాగునీటి పైప్‌లైన్, డ్రైనేజీ లీకేజీలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు

**కూకట్‌పల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు, డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగడంతో రోడ్లపై మురుగు పరుగుతీస్తోంది. నిత్యం రోడ్లపైన ప్రవహిస్తున్న మురుగులోనే వేలాది వాహనాలు రాకపోకలుసాగిస్తున్నాయి. దీంతో రోడ్లపై గుంతల్లో నిలిచిన మురుగునీరులోంచే వాహనాలు వేగంగా వెళ్తుడడంతో పాదచారులపై, ద్విచక్రవాహనదారులపై మురుగునీరు పడి ఇబ్బందులు పడుతున్నారు.


కూకట్‌పల్లి డివిజన్‌లోని విజ్ఞాన్‌పురి కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగు

### విజ్ఞాన్‌పురికాలనీలో

షాపూర్ నుంచి కూకట్‌పల్లి వెళ్లే అత్యధికశాతం వాహనాలు విజ్ఞాన్‌పురికాలనీ, సాయిబాబానగర్‌ల మీదుగా కూకట్‌పల్లి ప్రధాన రోడ్డుకు వెళ్తుంటారు. అదే రోడ్డులో మురుగునీరు రోడ్డుపై నిలిచిఉండటంతో వేలాది వాహనాలు మురుగులోంచే వెళ్లాల్సిన పరిస్థితి నెలకుంది.

### శేషాద్రినగర్‌లో

శేషాద్రినగర్‌లో కూడా రోడ్లపైన మురుగునీరు నిత్యం నిలిచిఉంటుంది. దీంతో దోమలు వృద్ధిచెంది విషజ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని కాలనీవాసులు పేర్కొంటున్నారు ఇప్పటికైనా జలమండలి అధికారులు రోడ్లపైన పారుతున్న మురుగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయా కాలనీలవాసులు కోరుతున్నారు.

### మురుగు సమస్య పరిష్కరిస్తాం

విజ్ఞాన్‌పురి, శేషాద్రినగర్‌లో రోడ్లపైన పారుతున్న మురుగు నీటి సమస్యను త్వరగా పరిష్కరిస్తాం. ఎక్కడ సమస్యలు ఉన్నా జలమండలి అధికారుల దృష్టికి తీసుకురావాలి.
- సతీష్, జలమండలి కూకట్‌పల్లి డివిజన్ మేనేజర్

## ప్రజలకు ఎమ్మెల్యే హోలీ శుభాకాంక్షలు



**కూకట్‌పల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగ అందరూ ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.

## 'లోక్‌సత్తా' కృష్ణారావు ఇక లేరు


కృష్ణారావు (ఫైల్)

**కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** లోక్‌సత్తా పార్టీ సీనియర్ నాయకులు జెకృష్ణారావు(88) అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. రాజన్న- సిరిసిల్ల జిల్లా దుర్రవరం గ్రామానికి చెందిన జె.కృష్ణారావు చిగురుమామిడి ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగ విరమణ చేశారు. లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణతో కలిసి ఆయన పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పార్టీ కన్వీనర్‌గా ఉంటూ 2009లో కూకట్‌పల్లి నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసిన జయప్రకాష్ నారాయణ విజయంలో తనవంతు పాత్ర పోశించారు. తెలంగాణ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్‌లో కీలకంగా పని చేశారు. టీజేఏసీలో కీలకంగా ఉన్నారు. కేపీహెచ్‌బీ ఆరోఫేజ్‌లో నివాసం ఉండే కృష్ణారావు కొద్ది రోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. కుటుంబసభ్యులు కూకట్‌పల్లిలోని వెంకటరావునగర్‌లోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



సూచిక బోర్డు వద్ద ఏసీపీ హనుమంతరావు, సీఐ నర్సింహరాజు, ఎస్సైలు

## బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిని సూచించే బోర్డుల ఏర్పాటు

**బాలానగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిని సూచించే సూచిక బోర్డులను పోలీసులు ఏర్పాటు చేశారు. బాలానగర్ ఏసీపీ హనుమంతారావు నేతృత్వంలో బాలానగర్ సీఐ టి.నర్సింహరాజు ఆధ్వర్యంలో ఐడీపీఎల్, ఫిరోజ్‌గూడా, ఇందిరానగర్ తదితర చౌరస్తాల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ హనుమంతారావు మాట్లాడుతూ బోర్డుల ఏర్పాటు వల్ల ఏదైన సంఘటన జరిగితే ఆ ఏరియా ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందో ప్రజలు నిర్ధారించుకునే వీలుంటుందని తెలిపారు. సీఐ నర్సింహరాజు మాట్లాడుతూ సూచిక బోర్డుల ఏర్పాటుతో ఏదైన సంఘటన జరిగే తొందరగా ఆయా పోలీస్‌స్టేషన్ల సిబ్బందికి సమాచారం ఇచ్చేందుకు వీలుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ సీఐ నర్సింహ్మరాజు, అడ్మిన్ ఎస్సై రాంనారాయణ్, ఉమెన్ ఎస్సై సరళ, ఏఎస్ఐ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి తాగుతున్న ఆరుగురు యువకుల అరెస్ట్

**హైదర్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):** కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి తాగుతున్న ఆరుగురు యువకులను బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్ ఇందు ఫార్చ్యూన్ అపార్ట్మెంట్స్ వద్ద నిర్మానుష్య ప్రదేశంలో యువకులు గంజాయి తాగుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ మేరకు వారి నుంచి 270 గ్రాముల కుష్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాగా, స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ దాదాపు రూ. 5లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. నిందితులను విచారణ నిమిత్తం కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు. వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086



చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

## హఫీజ్‌పేట కొత్తకుంట చెరువు పరిశీలన

**మియాపూర్, మార్చి13 (ఆంధ్రజ్యోతి):** హఫీజ్‌పేటలోని కొత్తకుంట చెరువును హైడ్రా కమిషనర్ రంగనాథ్ గురువారం పరిశీలించారు. స్థానికుడు ధాత్రీనాథ్‌గౌడ్ చెరువుచుట్టూ జరిగిన అభివృద్ధిని వివరించడంతో పాటు దశల వారీగా కొత్తచెరువు పనుల ఫొటోలను ఆయనకు చూపించారు. ఈ సందర్భంగా రంగనాథ్ చెరువు అభివృద్ధికి నిధులు సమకూర్చిన యునైటెడ్ ఎన్‌జీఓ సంస్థను, జెన్‌పాక్ట్ సంస్థను అభినందించారు.



పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ను ప్రారంభించిన సీఎండీ ముషారఫ్

## విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

**ఖేల్‌కాలనీ, మార్చి13 (ఆంధ్రజ్యోతి):** వేసవిలో విద్యుత్ సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అన్నారు. ఉస్మాన్‌నగర్ సబ్ డివిజన్, ఎంఐజీ కాలనీ సెక్టార్, ఆర్‌సి.పురం సబ్‌డివిజన్, పటాన్‌చెరు డివిజన్‌లో 8 మెగావాట్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకుండా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నారు. ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్‌కు ముందస్తు మరమ్మతులు చేపట్టి, ఓవర్‌లోడ్ పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఎండీ వెంట ఇన్‌చార్జి డైరెక్టర్ నందకుమార్, సీఈ కామేష్, సంగారెడ్డి ఎస్ఈ శ్రీనాథ్, పటాన్‌చెరు డీఈ భాస్కర్, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సమాఖ్య నాయకులు

## ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకోండి

**గచ్చిబౌలి, మార్చి 13, (ఆంధ్రజ్యోతి):** శేరిలింగంపల్లి మండల పరిధిలో అనేక ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వ అనుమతి లేదని, దాంతోపాటు విద్యార్థులనుంచి ఇష్టానుసారంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నాయని, ఈ స్కూళ్ల యాజమాన్యాలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం మండల విద్యాధికారి వెంకన్నకు వినతి పత్రాన్ని అందజేసింది. సమాఖ్య నాయకులు రాష్ట్ర నాయకులు పల్లె మురళి, గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ శ్రీకాంత్‌కు అందజేశారు. మండల పరిధిలో కార్పొరేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా కనీసం పది పాఠశాలల్లో ఏ ఒక్కదానికైనా అనుమతులు ఉన్నాయో.. లేదో తల్లి దండ్రులు తెలుసుకోలేని పరిస్థితులు ఉన్నాయని వారు ఆరోపించారు. పేద మధ్య తరగతుల విద్యార్థుల తల్లి దండ్రులపై వీరు మోపే ఫీజుల భారం వారి ఆర్థిక స్థితిగతులు చిన్నా భిన్నం అవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపించాలని కోరారు. అడ్మిషన్ ఫీజులు, వార్షిక ఫీజుల రూపంలో అక్రమంగా వసూళ్లు చేస్తున్నారని వారు వివరించారు. ఫీజుల దోపిడీపై స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారికి వారు విజ్ఞప్తి చేశారు.



ఉమెన్స్‌డే వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శశిధర్

## వృద్ధుల అనాథాశ్రమంలో ఉమెన్స్‌డే వేడుకలు

**హైదర్‌నగర్, మార్చి13 (ఆంధ్రజ్యోతి):** ఆల్విన్‌కాలనీ డివిజన్ రాజేశ్వరి వృద్ధుల అనాథ ఆశ్రమంలో గురువారం శక్తి దా పవర్ ఆఫ్ ఉమెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమెన్స్‌డే వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారి శశిధర్ వృద్ధాశ్రమంలో అందరితో కలిసి కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో రాణించడం సంతోషంగా ఉందని, భవిష్యత్‌లో వారు మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దుర్గ, సుజాత, వెంకట్, లక్ష్మి, రాధిక, శాంతి, లావణ్య, అపర్ణ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీగణపతి స్వామి ఆలయంలో నేడు పూజలు

**చందానగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** చందానగర్ శిల్పాఎన్‌క్లేవ్ లక్ష్మీగణపతిస్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విశేష పూజలు, హోమం, పంచామృతాభిషేకాలు, అర్చనలు లక్ష్మీ గణపతిస్వామికి కల్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని ఆలయ ఫౌండర్ ఛైర్మన్ యు.వి.రమణమూర్తి, అర్చకబృందం, కమిటీ సభ్యులు, భక్తులు ఉన్నారు.



**హ్యాపీ బర్త్ డే..**

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు చెబుతున్న కార్పొరేటర్ రోజాదేవి

-హైదర్‌నగర్, (ఆంధ్రజ్యోతి)




రాత్రుల్లో వీధి దీపాలు వెలగక చిమ్మచీకటిలో పాపిరెడ్డికాలనీ రోడ్డు

### చీకటిపడితే ఇక్కడ ప్రయాణం నరకమే

- వీధిదీపాలు ఉన్నా వెలగవు
- ఆందోళనకు గురవుతున్న మహిళలు, చిన్నారులు
- హైటెక్ నియోజకవర్గం.. పాపిరెడ్డికాలనీ రోడ్డు దుస్థితి

**చందానగర్, మార్చి13 (ఆంధ్రజ్యోతి):** అసలే నిర్మానుష్య ప్రాంతం.. ఓవైపు శ్మశానవాటిక, మరోవైపు చెరువు, రోడ్డు ఇరువైపులా పిచ్చిమొక్కలు, దీనికి తోడు రాత్రుల్లో కారుచీకటి.. ఊహించుకుంటే భయం తప్పా మరొకటి ఉండదు. హైటెక్ నియోజకవర్గం శేరిలింగంపల్లి డివిజన్ లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి నుంచి పాపిరెడ్డికాలనీకి వెళ్లే రహదారి పొడవునా వెలగని వీధి దీపాల దుస్థితి ఇది. 50 నుంచి 60 వేల జనాభా ఉన్న కాలనీవాసులు ఈ మార్గం ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. వీరంతా రెక్కాడితేగాని డొక్కాడని పేదలు, మధ్యతరగతికి చెందిన వారే. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పొట్టకూటికోసం వలస వచ్చి ఇండ్ల అద్దె తక్కువగా ఉంటుందని పాపిరెడ్డి, సందయ్యనగర్, రాజీవ్‌గృహకల్ప, సురభి, రాజీవ్ స్వగృహల్లో నివాసం ఉంటూ పాచిపనులు చేసుకునే కష్టజీవులు. ఉదయం సూర్యోదయం రాకముందు పాచిపనులకు వెళ్లి.. రాత్రుల్లో ఎప్పుడు వస్తారో తెలియని స్థితి. మహిళలు కూడా రాత్రి 10గంటల వరకు విధులు నిర్వహించి ఒంటరిగా అరచేతుల్లో ప్రాణాలను పెట్టుకొని రావాల్సిన పరిస్థితి. దీనికి తోడు ఈ మార్గంలో పోకిరీలు సంచరిస్తుంటారు. ఎప్పుడు ఎమి జరుగుతుందో అనే భయం దీనికి తోడు చిమ్మచీకటిలో రాకపోకలు సాగిస్తున్నారు. నెల రోజుల నుంచి విధిదీపాలు వెలగకపోయినా పట్టించుకునే వారే లేరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాపిరెడ్డికాలనీకి వెళ్లే రహదారి పొడవునా వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



### వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలి



గత నెల రోజుల నుంచి లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి పాపిరెడ్డికాలనీ వెళ్లే రహదారి పొడవునా వీధి దీపాలు వెలుగడంలేదు. ఈ మార్గంలో నిత్యం వేల సంఖ్యల్లో రాకపోకలు సాగిస్తున్నారు. మహిళలు ఇండ్లలో పనులకు వెళ్లేవారే ఎక్కువ. రాత్రి సమయంలో లైట్లు లేక చిమ్మచీకటి ఉండడంతో భయంతో ఇబ్బందులు పడుతున్నారు.

- బద్దం కొండల్‌రెడ్డి, పాపిరెడ్డికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

### 5.6కేజీల సరుకు స్వాధీనం

**రాయదుర్గం, మార్చి13 (ఆంధ్రజ్యోతి):** ఇద్దరు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులను రాయదుర్గం పోలీసులు గురువారం అదుపులోకి తీసుకుని వారి నుంచి 5.6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్రపురి కాలనీ ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు రాయదుర్గం పోలీసులు గురువారం రాత్రి 7గంటల సమయంలో చిత్రపురి కాలనీకి చేరుకుని ఖమ్మంకు చెందిన వాసుదేవరెడ్డి (29), వెంకట్‌రెడ్డి(27) అనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఎండుగంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులిద్దరు ఎంతకాలం నుంచి గంజాయి సరఫరా చేస్తున్నారు, ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారనే విషయాలు విచారణలో వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు.

# తాగునీటి పనులను పూర్తిచేయాలి

### జలమండలి ఎండీతో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

**మియాపూర్, మార్చి13 (ఆంధ్రజ్యోతి):** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న తాగునీటి పైపులైను పనులను పూర్తిచేయాలని, వేసవిలో నీటిఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని కోరారు. గురువారం ఎమ్మెల్యే జలమండలి ప్రధాన కార్యాలయంలో ఎండీని కలిసి పెండింగ్ ఉన్న పైపులైను పనులను పూర్తిచేయడంతో పాటు యూజీడీ, తాగునీటి కొత్త లైన్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి తలెత్తకుండా పైపులైను లీకేజీలను అరికట్టాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. దశల వారీగా నిధులు మంజూరు చేస్తామని చెప్పారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

### కార్యకర్తలకు హోలీ శుభాకాంక్షలు

**మియాపూర్, మార్చి13 (ఆంధ్రజ్యోతి):** శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. హోలీ అందరి జీవితాల్లో ఆనందం, శాంతి, సౌభాగ్యం తీసుకురావాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ప్రజలు సహజ సిద్ధరంగులు మాత్రమే వాడాలని సూచించారు.

# పదో తరగతి విద్యార్థులకు పరీక్షల కిట్లు



విద్యార్థినికి పరీక్షల కిట్టు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, క్షత్రియ యూత్ ఫెడరేషన్ ప్రతినిధులు

**హైదర్‌నగర్, మార్చి13(ఆంధ్రజ్యోతి):** హైదర్‌నగర్ డివిజన్ నిజాంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్షత్రియ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పరీక్షల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉన్న సమయం వృధా చేసుకోకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. విద్యార్థుల జీవితంలో పదోతరగతి కీలక మలుపు అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సాయికుమార్, క్షత్రియసేవా సమితి ప్రతినిధులు భూపతి రాజు రామకృష్ణంరాజు, సుధీర్‌వర్మ, సుధాకర్ రాజు, గౌతం వర్మ, శివాజీరాజు పాల్గొన్నారు.

### వైజ్ఞానిక ప్రదర్శనలు భేష్

వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో ఆలోచనలు పెంపొందించడంతో పాటు క్రియేటివిటీని పెంపొందిస్తాయని కార్పొరేటర్ శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులు రూపొందించిన నమూనాలను తిలకించారు. ఈసందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారు రూపొందించిన నమూనాల గురించి అడిగి తెలుసుకుని వారిని అభినందించారు.

## సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించాలి

**ఖేల్‌కాలనీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):** సంస్కృతి, సంప్రదాయాలను విస్మరించకుండా ఏడాదికోసారి వాటిని కుటుంబసమేతంగా జరుపుకోవడం గొప్ప విషయమని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలో గల ఎంఐజీకాలనీలో కేరళ సంఘం ఆధ్వర్యంలో గురువారం అట్టుకల్ పొంగల్ వేడుకను వైభవంగా జరుపుకున్నారు. కేరళ సంప్రదాయ నృత్యాలతోపాటు, వారి రాష్ట్రీయ వంటకాలతో విందు ఏర్పాటు చేసి తమ కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడిపారు. ఉదయం నుంచి ఆటపాటలతో కూడిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సాంప్రదాయ దుస్తులతో కేరళ మహిళలు అమ్మవారికి పొంగల్ సమర్పించారు. సింధూఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ, దేశంలోనే కేరళ రాష్ట్రం అక్షరాస్యతలో ప్రథమ స్థానంలో ఉండి, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. కేరళకు చెందిన పలువురు మహిళలు నగరంలో విద్య, వైద్య సంస్థల్లో తమ విలువైన సేవలు అందజేస్తూ, మానవీయతను చాటుతున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.



అట్టుకల్ పొంగల్ వేడుకల్లో కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

## జోరుగా రంగుల అమ్మకాలు

**చందానగర్, మార్చి13 (ఆంధ్రజ్యోతి):** చందానగర్, శేరిలింగంపల్లి, గంగారం, రాయదుర్గం, మాదాపూర్, కొండాపూర్, హఫీజ్‌పేట్ , మియాపూర్ తదితర ప్రాంతాల్లో రంగు రంగుల దుకాణాలు భారీగా వెలిశాయి. డిమాండ్‌కు అనుగుణంగా ఎక్కువ ధరలకు అమ్ముతూ వ్యాపారం జోరుగా కొనసాగుతోంది.





చందానగర్, శేరిలింగంపల్లిలో వెలిసిన రంగుల దుకాణాలు

## ఎమ్మెల్యే అనిరుధ్ నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాలేదు : హైడ్రా

**హైదరాబాద్ సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):** వంశీరాం బిల్డర్స్ మ్యాన్ హట్టన్ ప్రాజెక్టు అంశంలో ఎమ్మెల్యే అనిరుధ్ నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని హైడ్రా అధికారులు తెలిపారు. వంశీరాం బిల్డర్స్ మ్యాన్ హట్టన్ ప్రాజెక్టు బీఆర్ఎస్ హయాంలో అతి పెద్ద స్కామ్ అని, చెరువు బఫర్‌జోన్‌లో ఇది ఉందని, దీనిపై హైడ్రాకు ఫిర్యాదు చేస్తే రిసిప్ట్ ఇవ్వడం లేదని, రూ. వేల కోట్ల స్కాంపై జీరో అవర్‌లో ప్రశ్నిస్తానని ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై అధికారులు స్పందించారు. ఖాజాగూడలోని కొత్త కుంటలో వంశీరాం బిల్డర్లు నిర్మాణాలు చేపడుతుండడంపై ఫిర్యాదులు అందాయని, దీనిపై హైకోర్టు నుంచి కూడా హైడ్రాకు డైరెక్షన్ వచ్చిందన్నారు. అయితే వంశీరాం బిల్డర్స్ మ్యాన్ హట్టన్ ప్రాజెక్టు అంశంలో తమకు నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు. ప్రజావాణికి వస్తున్న ఫిర్యాదులకు హైడ్రా రిసిప్ట్‌లు ఇస్తుందని వారు పేర్కొన్నారు.

## ప్లాట్ల క్రమబద్ధీకరణను వేగవంతం చేయాలి

- మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

**నిజాంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్‌ఆర్‌ఎస్ అధికారిక లే అవుట్‌ల్లో ప్లాట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేసి, మార్చి 31 వరకు ముగించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. గురువారం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ ఎల్‌ఆర్ఎస్ ప్రక్రియపై కమిషనర్, తహసీల్దార్, వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు.



యాగశాలలో ధనలక్ష్మీహోమం నిర్వహిస్తున్న పూజారులు

## లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధనలక్ష్మీ హోమం

**ఖేల్‌కాలనీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):** శ్రీ అభిషేక లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో జరుగుతున్న శ్రీ మహాలక్ష్మీ యాగంలో భాగంగా గురువారం విశేష ఉత్సవాలు జరిగాయి. స్వామివారి మూల విగ్రహానికి విశేషహోమాలు, అర్చనలు నిర్వహించి ఉత్సవాన్ని ప్రారంభించారు. 108 కేజీల హరిద్రాభిషేకం, లక్షతులసి అర్చన, చక్రార్చన తదితర పూజలను నిర్వహించారు. దేవాలయ ప్రాంగణం యాగశాలలో ధనలక్ష్మీహోమం వైభవంగా సాగింది. సాయంత్రం నిత్యపూజలు, విష్ణు సహస్రనామపారాయణం, సూక్తార్చన, మహాలక్ష్మీహోమం జరిగాయి. సుగంధ పుష్పాలతో అలంకరించిన చంద్రప్రభ వాహనంపై లక్ష్మీ అమ్మవారి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ దేవాలయ నాలుగు వీధుల్లో ఊరేగించారు. దేవాలయ ప్రధాన అర్చకుడు భార్గవ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో కార్యవర్గ సభ్యులు, కార్మికులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



దేవాలయ ఆవరణలో కాముని దహనం చేస్తున్న అర్చకులు

## వేంకటేశ్వర ఆలయంలో కామ దహనం

**ఖేల్‌కాలనీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):** హోలీ పర్వదినం సందర్భంగా బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లో గల శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పౌర్ణమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. హోలీ పండుగ ముందు రోజు కామదహనం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుండడంలో ఉత్సవం ప్రారంభించారు. మనిషిలోని రాగద్వేషాలను దహనం చేసి, స్వచ్ఛతకు ప్రతీకలైన రంగుల ద్వారా వాటిని తొలగించడం దాని పరమార్థమని పురాణాలు పేర్కొంటున్నాయి. స్వామివారికి విశేషపూజలు నిర్వహించి, అభిషేకాలను చేశారు. దేవాలయ గోపురం ఎదుట కామదహనం చేపట్టి దేవస్థాన ప్రధాన అర్చకుడు రామకృష్ణమాచార్యుల పర్యవేక్షణలో వేడుకలు జరుపుకున్నారు.

## కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకే వర్సిటీ భూముల వేలం : సీపీఎం

**మియాపూర్, మార్చి13 (ఆంధ్రజ్యోతి):** అత్యంత విలువైన ప్రాంతం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూమిని ప్రభుత్వం వేలం వేయాలని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని చూడటం అన్యాయమని సీపీఎం నాయకుడు శోభన్ అన్నారు. సెంట్రల్‌యూనివర్సిటీ భూములను వేలం వేయాలని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఆయన గురువారం మాట్లాడుతూ, వర్సిటీకి చెందిన భూములు విద్యార్థులకు ఉపయోగపడాలి తప్ప ఇలా అన్యాక్రాంతం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా వేల కోట్ల విలువ చేసే ఖానామేట్ ప్రభుత్వ భూములను వారి బినామీలు, బంధువులకు అప్పగించి వేలకోట్లు దండుకున్నదని ఆరోపించారు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన హెచ్‌సీయూ భూములను వేలం వేయడం ప్రజా వ్యతిరేక విధానమన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఎలా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించారో, సీఎం రేవంత్‌రెడ్డి కూడా అదే బాటలో వెళ్తున్నారని ఇది మానుకోవాలన్నారు. ఇప్పటికైన ప్రభుత్వ భూముల వేలం వెనుకకు తీసుకోవాలని, లేకుంటే తమపార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## ప్రభుత్వ భూమి కబ్జాపై ఫిర్యాదు

**గచ్చిబౌలి, మార్చి 13, (ఆంధ్రజ్యోతి):** శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపీనగర్ ప్రాంతం.. సర్వే నంబర్ 64 లోని మొత్తం 2,360 గజాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతున్నా అధికారులెవరూ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని జనం కోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు గురువారం మండల తహశీల్దార్ వెంకారెడ్డికి ఆయన వినతి పత్రాన్ని అందజేశారు. ఆ స్థలాన్ని 2010, ఫిబ్రవరి 9న ప్రభుత్వం బీసీ హాస్టల్, పోస్టాఫీసు, కమ్యూనిటీ భవనానికి 2,360 గజాలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అప్పటి అధికారులు ఆ స్థలంలో కేవలం బీసీ హాస్టల్ నిర్మించారు.. కానీ, సబ్ పోస్టాఫీసు, కమ్యూనిటీ భవనం మాత్రం నిర్మించలేదు. దీంతో ఈ విలువైన స్థలంపై స్థానికులు కొంతమంది తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జాచేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారని ఆయన ఆరోపించారు.

**పిక్సెలిన్ సైన్సెస్ వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించడానికి విప్లవాత్మక ఉత్పత్తులను పరిచయం చేసింది.**

**హైదరాబాద్, మార్చి:** వ్యవసాయ ఆవిష్కరణలలో అగ్రగామిగా ఉన్న పిక్సెలిన్ సైన్సెస్ పంటల దిగుబడిని పెంచడానికి, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి మరియు తెగుళ్ళ నిరోధకతను పెంపొందించడానికి రూపొందించిన సంచలనాత్మక పరిష్కారమైన పాలిహాలైట్ కాంప్లెక్స్ వెలెన్స్ మరియు వెర్సాటైర్ లను హెచ్ఐసీసీలో జరిగిన వ్యవసాయ సదస్సులో పాల్గొన్న తుమ్మల యుగంధర్‌చే సగర్వంగా ప్రకటించారు. వాటితో పాటు డ్రోన్ మరియు ఏఐ సహాయం తో కూడా వ్యవసాయం చేసే పద్ధతులు వివరించారు. ఎరువుల వాడకాన్ని తగ్గించడం మరియు డ్రోన్ లు ఏఐ ల



లో ద్వారా తక్కువ సమయంలో రైతులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా పిచికారి చేయడం ద్వారా రైతులు ఇప్పుడు పంట దిగుబడిని 20 నుండి 50 శాతం పెంచుకోవచ్చు అని తుమ్మల యుగంధర్ ఈ సదస్సులో తెలిపారు.

ADVERTISEMENT

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086



వివిధ రంగులు

రంగులు విక్రయించే దుకాణం

# రంగుల రంగేళి హోలీ

షాపూర్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): హోలీ అనేది రంగుల పండుగ. దీనిని చిన్నా పెద్ద, కులమతాలకు అతీతంగా జరుపుకొంటారు. వసంత కాలంలో వచ్చే ఈ పండుగను అన్ని దేశాల వారూ జరుపుకొంటారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో హోలీ సందరంగా రంగుల దుకాణాలు ఇబ్బడి ముబ్బడిగా వెలిశాయి. షాపూర్‌నగర్, సూరారం, చింతల్, దుండిగల్, బాచుపల్లి, కొంపల్లి, కుత్బుల్లాపూర్, గాజులరామారం, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాల్లోని దుకాణాలకు ప్రజలు పోటెత్తుతున్నారు. రంగులు కొనుగోలు చేస్తూ పండుగకు సిద్ధమవుతున్నారు.

**పండుగ ప్రాముఖ్యం**

హిందూమత విశ్వాసం ప్రకారం హోలీ పండుగకి ఎంతో ప్రాముఖ్యం ఉంది. బంధు మిత్రులతో బంధాన్ని మరింత బలోపేతంగా మార్చేందుకు ఇలాంటి పండుగలు దోహదపడతాయి. ప్రతియేటా ఫల్గుణమాసంలో పౌర్ణమి రోజున హోలీ పండుగను జరుపుకొంటారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

- కెమికల్ రంగులను వాడరాదు. వీటితో కళ్లకు ప్రమాదం పొంచి ఉంది.
- నాణ్యమైన రంగులను కొనుగోలు చేయాలి.
- పెద్దవారు దగ్గర ఉంటే మంచిది.
- కళ్లలో రంగులు పడకుండా కంటి అద్దాలు ఉపయోగించడం సురక్షితం.



రంగుల జల్లుకుంటున్న బాలలు (ఫైల్)



మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశమైన కలెక్టర్ గౌతమ్

## ప్లాట్ల క్రమబద్ధీకరణను వేగవంతం చేయాలి

- మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

నిజాంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ అధికారిక లే అవుట్‌ల్లో ప్లాట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేసి, మార్చి 31 వరకు ముగించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. గురువారం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ ఎల్ఆర్ఎస్ ప్రక్రియపై కమిషనర్, తహసీల్దార్, వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వివరాల గురించి ఆరా తీశారు. దరఖాస్తు చేసుకున్న వారికి మెసేజ్‌లు పంపి వారికున్న సమస్యలను నివృత్తి చేసి రెగ్యులరైజేషన్‌ను పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. ఈ నెల 31వ తేదీలోగా ప్లాట్ల క్రమబద్ధీకరణ చెల్లిస్తే 25 శాతం రాయితీ ఉంటుందనే విషయాన్ని దరఖాస్తుదారులకు క్లుప్తంగా వివరించాలన్నారు. అలాగే మొత్తం రుసుము ఒకేసారి చెల్లించేలా ప్రయత్నం చేయాలన్నారు. హెల్ప్ డెస్కులలో వచ్చే ఫిర్యాదులను కూడా పరిగణలోకి తీసుకుని సకాలంలో చర్యలు తీసుకోవాలని సూచించారు. సాంకేతిక ఇబ్బందులను అధిగమిస్తూ ఈ ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించారు. అదే విధంగా మున్సిపల్ పరిధిలో ఆస్తి పన్నులు సకాలంలో చెల్లించేలా ప్రజలను చైతన్యపరిచి, ఆ దిశగా ప్రయత్నాలను ముమ్మరం చేయాలన్నారు. బాచుపల్లి మండలంలో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా చూడాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో కమిషనర్ సాబేర్ అలీ, బాచుపల్లి తహశీల్దార్ పూల్‌సింగ్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## ఆకతాయిలకు అడ్డా ఆక్సిజన్ పార్కు

- మద్యం ప్రియులకు నిలయంగా గాజులరామారం పార్కు
- సందర్శకులను భయపెడుతున్న అల్లరి మూకలు
- ఆట వస్తువుల ధ్వంసం



ఆక్సిజన్ పార్కు ముఖద్వారం

గాజులరామారం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. సెక్యూరిటీ కళ్లు కప్పి ఆకతాయిలు పార్కులో ప్రవేశించి ఇష్టారీతిన ప్రవర్తిస్తున్నారు. గాజులరామారం డివిజన్‌లోని ఆక్సిజన్ పార్కులో ఆటకాయిలు తిష్టవేస్తూ పార్కుకు వచ్చిపోయే వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రజల సౌకర్యార్థం గత ప్రభుత్వ హయాంలో లాల్‌సాబ్‌గూడకు వెళ్ళే రోడ్డుకు ఆనుకొని ఉన్న 40 ఎకరాల్లో ఫారెస్ట్, జీహెచ్ఎంసీ అధికారుల సమన్వయంతో పార్కును నిర్మించారు. అప్పటి మంత్రి కేటీఆర్, స్థానిక ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలసి పార్కును ప్రారంభించారు. కొన్ని రోజులు బాగానే ఉన్నా ఆ తర్వాత పార్కులో ఏర్పాటు చేసిన బొమ్మలు, ఆట వస్తువులు దొంగలు దొంగిలించడమే కాకుండా, మరికొన్నింటిని గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టారు.



ఈ దారి నుంచే వస్తున్న ఆకతాయిలు

**ప్రహరీ నిర్మించాలి**

పార్కు చుట్టూ అధికారులు ప్రహరీని నిర్మించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు లోపలికి ప్రవేశించి మద్యం సేవిస్తూ, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనిపేర్కొంటున్నారు. పార్కులో ప్రవేశానికి ఎంట్రీ ఫీజు పెట్టినా ప్రధాన గేటు ముందు వచ్చేవారు ఫీజు చెల్లించి లోపలికి వస్తున్నారు.. కానీ ఓపెన్ స్థలం నుంచి వచ్చేవారి సంఖ్య ఎక్కువగా ఉంటోందని సమీప బస్తీ ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కు చుట్టూ ఫెన్సింగ్ లేదా ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.

**ఆకతాయిల తిష్ట**

ఆదివారం, సెలవు దినాల్లో ఆకతాయిలు ఉదయం నుంచి సాయంత్రం వరకు గుంపులుగా పార్కులోకి ప్రవేశించి గంజాయి తాగుతూ, వచ్చిపోయే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని సందర్శకులు తెలుపుతున్నారు. లక్షల రూపాయలు ఖర్చుచేసి పార్కును అందంగా ఏర్పాటు చేస్తే ఆకతాయిల వల్ల అందవికారంగా తయారు అవుతుందని పలువురు తెలుపుతున్నారు.

**ఆగడాలను అరికట్టాలి**

పార్కుకు వచ్చే ఆకతాయిలను గుర్తించి అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. సెలవు దినాల్లో చిన్న పిల్లలతో కలసి కుటుంబ సభ్యులు వస్తుంటారు. వారికి ఇబ్బంది కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలి.



- సాతాల గోపాల్, దేవేందర్‌నగర్

**వెలగని వీధిలైట్లు**



వెలగని విద్యుత్ లైట్‌లు

పార్కు చుట్టూ ఏర్పాటుచేసిన సోలార్ విద్యుత్ లైట్లు పని చేయక సంవత్సరాలు గడుస్తున్నా మరమ్మతులు చేయడంలో అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో సాయంత్రం పార్కులో వాకింగ్ చేసేవారికి ఇబ్బందికరంగా మారుతుందని పలువురు తెలుపుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా పెడచెవిన పెడుతున్నారని వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## కొరవడిన నిఘా.. అర్ధరాత్రి దాకా బెల్ట్ షాపులు



ప్రసూననగర్‌లో అర్ధరాత్రి తెరుచుకున్న దుకాణం

కుత్బుల్లాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణలో అగ్రభాగంలో ఉన్నామని అధికారులు గొప్పలు చెబుతున్నారే తప్ప, అమలు చేయడంలో నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నారనే విమర్శలు వినవడుతున్నాయి. ఎక్కడ చూసినా గుట్కా, సిగరెట్, బెల్ట్ షాపులు అర్ధరాత్రి వరకు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. ఇందుకు నగర శివారులోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ప్రసూననగర్, షాపూర్‌నగర్, గండిమైసమ్మ, సుచిత్ర, పద్మానగర్ రింగురోడ్డు, కొంపల్లి, రామేశ్రీనగర్, భగత్‌సింగ్‌నగర్, తదితర ప్రాంతాలు అడ్డాలుగా మారాయి. కానీ ప్రభుత్వ నిబంధనల్లో మాత్రం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మినహాయింపుగా మారిందనే ఆరోపణలు లేకపోలేదు. సిగరెట్లు, గుట్కాలు, బెల్టు షాపుల్లో మద్యం ఇష్టానుసారంగా విక్రయిస్తున్నట్లు పలు కాలనీల వాసులు తెలుపుతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసుల నిఘా లేకపోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బాపునగర్‌లో బెల్ట్‌షాపు నిర్వాహకుడితో మాట్లాడుతున్న పెట్రోలింగ్ సిబ్బంది



రాకేష్‌ను శాలువాతో సత్కరిస్తున్న శ్రీశైలంగౌడ్

## ప్రజా శ్రేయస్సే మా సంకల్పం : కూన

షాపూర్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అధైర్యపడవద్దు అండగా ఉంటానని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గురువారం షాపూర్‌నగర్‌లోని తన నివాసం వద్ద నియోజకవర్గం ప్రజలను స్థానిక సమస్యలు అడిగితెలుసుకొన్నారు. అనంతరం ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన రాకేష్ ముదిరాజ్‌ను శాలువాతో సత్కరించారు. ప్రజలు ఇచ్చిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతమంది ప్రభుత్వ సంక్షేమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేసినా ప్రజా శ్రేయస్సే మా సంకల్పం అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ తేజశ్వి

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కుత్బుల్లాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మహిళా దినోత్సవాలను పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో గురువారం టౌన్ లెవెల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ తేజశ్వి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ఎదిగినప్పుడే ఆర్థిక స్వావలంబన సాధించినట్లు అవుతుందన్నారు. మహిళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వంతో పాటు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో పురుషుల కంటే మహిళలే ముందుండటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ నర్సింహ, ఆర్ఐ కృష్ణ, అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## డీసీఎం దగ్ధం



మంటల్లో దగ్ధమవుతున్న డీసీఎం

పేట్ బషీరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మెడికల్ వేస్టేజ్ లోడును డీసీఎం లారీ నుంచి దిగుమతి చేస్తుండగా అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. దూలపల్లి పారిశ్రామిక వాడలోని ఫాక్స్‌సాగర్ చెరువు సమీపంలోని స్ర్కాప్ దుకాణం వద్ద గురువారం రాత్రి డీసీఎంలోని మెడికల్ వేస్టేజ్ దిగుమతి చేస్తుండగా మంటలు చెలరేగాయి. దీంతో స్ర్కాప్ దుకాణం నిర్వాహకులు ఆందోళనకు గురయ్యారు. కాగా, ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ మంటల్లో డీసీఎం పూర్తిగా ఖాళీ బూడిదైపోంది.

## స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం

షాపూర్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సైలెన్సర్లు లేకుండా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేయాలని సూరారం ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌కు పర్యావరణ ప్రేమికుడు, సామాజిక కార్యకర్త కోలా రవిందర్ ముదిరాజ్ గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సూరారం కాలనీ మెయిన్ రోడ్లపై సైలెన్సర్లు లేకుండా యువకులు అతివేగంగా వెళుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకుని, వాహనాలను సీజ్ చేయాలని కోరారు. స్పందించిన సీఐ ఆ ప్రాంతంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సైలెన్సర్లు లేకుండా తిరుగుతున్నవారిని గుర్తించి నూతన చట్టాల ప్రకారం చర్యలు తీసుకొంటామన్నారు.



## నివాళులు

బీఆర్ఎస్ నాయకుడు, రాజీవ్‌గాంధీనగర్ శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దొడ్ల నర్సింహ దశదిన కర్మను గురువారం ఆయన కుమారుడు రాజీవ్‌గాంధీనగర్ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దొడ్ల శ్రీనివాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యన్నారాయణ హాజరై నివాళులు అర్పించారు.

- షాపూర్‌నగర్, ఆంధ్రజ్యోతి

## ఓల్డ్ హైదరాబాద్ రోడ్డును పునరుద్ధరించాలి

- మల్లంపేట వాసుల ధర్నా

దుండిగల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మల్లంపేట ఔటర్ రింగు రోడ్డు ఎగ్జిట్ నుంచి బాచుపల్లి వరకు 100 ఫీట్ల రోడ్డును తక్షణమే పూర్తిచేసి ప్రారంభించాలి. అదేవిధంగా బాచుపల్లి రెడ్డి ల్యాబ్స్ నుంచి ప్రణీత్ అంటిల్లా మీదుగా మల్లంపేట ఔటర్ రింగురోడ్డు వరకు మాస్టర్ ప్లాన్‌లో ఉన్న ఓల్డ్ హైదరాబాద్ రోడ్డును పునరుద్దరించాలి. ఈ విషయమై మల్లంపేట గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు ఎంబరి ఆంజనేయులు ఆధ్వర్యంలో గురువారం మల్లంపేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద స్థానికులతో కలిసి ఆందోళన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గతంలో ఇదే విషయమై స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదన్నారు. ఓల్డ్ హైదరాబాద్ రోడ్డు పునరుద్ధరించాలని హెచ్ఎండీఏ అధికారులు నిజాంపేట కమిషనర్‌కు లేఖ కూడా రాయడం జరిగిందన్నారు. ప్రస్తుతమున్న మల్లంపేట రోడ్డు ఇరుకుగా ఉండటం, జనాభా పెరిగి వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుందన్నారు. ఈ ధర్నా విషయమై ఎమ్మెల్యే వివేకానంద్ స్పందించి అసెంబ్లీలో సమస్యను లేవనెత్తి పరిష్కారం చూపే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించకపోతే గ్రామస్తులమంతా కలిసి మరోసారి పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు.




మల్లంపేటలో ధర్నా చేస్తున్న స్థానికులతో ఎంబరి ఆంజనేయులు

## తాగునీటి కొరత లేకుండా చూడాలి

- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



దుండిగల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో తాగునీటి సరఫరా సరిగా జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పది సంవత్సరాల క్రితం ఏర్పడిన సమస్య మరలా పునరావృతమైందని, దీనిపై ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాల్సిన అవసరముందని గురువారం జరిగిన శాసనమండలిలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తాగునీటి సమస్యపై ప్రసంగించారు.

ప్రస్తుతం ఎక్కడ చూసినా మంచినీటి ట్యాంకర్లు, ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి దాపురించిందన్నారు. శివారు ప్రాంతాల్లో బోర్లన్నీ అడుగంటిపోతున్నాయని, దీనిపై ప్రత్యేక దృష్టిసారించి నగర ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## ఆకృతి కన్‌స్ట్రక్షన్‌పై చర్యలు

- ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు

నిజాంపేట్ , మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఆకృతి కన్‌స్ట్రక్షన్స్‌పై చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని బీజేపీ నాయకుడు ఆకుల సతీష్ తెలిపారు. నిజాంపేట కార్పొరేషన్ బాచుపల్లిలో సర్వే నంబర్ 453ని ఆకృతి కన్‌స్ట్రక్షన్స్ నిర్మాణాల్లో తనకు అనుకూలంగా ప్రభుత్వ భూమిని అప్రోచ్ రోడ్డుగా చూపించుకుని, దానికి జిల్లా అధికారుల ద్వారా ఎన్‌ఓసీ తెప్పించుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొట్టాయని ఆయన తెలిపారు. ఈ విషయమై గతంలో పలుమార్లు జిల్లా అధికారులకు ఆయన ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ భూమినే అప్రోచ్‌రోడ్డుగా చూపించుకుని హెచ్ఎండీఏ అనుమతితో అప్పటి బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్రోచ్ రోడ్డుకు ఈ స్థలాన్ని కేటాయించాలని బిల్డర్ సంబంధిత నాయకులను, అధికారులను కలువగా వారు బిల్డర్‌కు అనుకూలంగా రిపోర్టు ఇచ్చారు. దీనిపై ఆకుల సతీష్ హైకోర్టును ఆశ్రయించి కేసు వేశారు. ఆ ఫిర్యాదు మేరకు నాలుగు వారాల్లోగా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బుధవారం నిజాంపేట మున్సిపల్ కమిషనర్‌కు, బాచుపల్లి తహసీల్దార్‌కు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అవసరమైతే పిటిషనర్‌ను, హైడ్రా కమిషనర్‌ను సంప్రదించి చట్టపరంగా చర్యలు తీసుకునే వెసులుబాటు ఇచ్చింది. ఒకవేళ అధికారులు 4 వారాల్లో చర్యలు తీసుకోకుంటే మళ్లీ హైకోర్టును ఆశ్రయిస్తామని సతీష్ తెలిపారు.



నూతనంగా నిర్మించిన బ్రిడ్జి

## త్వరలో అందుబాటులోకి బ్రిడ్జి

పేట్‌బషీరాబాద్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ళుగా ఇబ్బంది పడిన ఆ కాలనీల ప్రజల కల నూతన బ్రిడ్జి నిర్మాణంతో నెరవేరింది. జీడిమెట్ల డివిజన్‌లోని వెంకన్నహిల్స్, ప్రశాంత్‌నగర్ మధ్య నాలా ఉండేది. వర్షాకాలంలో ఈ ప్రాంత ప్రజలు నాలా దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనికి తోడు నాలా ప్రవాహం ఉధృతంగా ఉంటే ఇళ్లలోకి నీరు చేరి ఇక్కడి ప్రజలు నిద్రలేని రాత్రులు గడిపారు. వీరి సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే, అధికారులు దాదాపు రూ.60 లక్షల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. గత పార్లమెంట్ ఎన్నికల ముందు పనులకు శంకుస్థాపన చేసి ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనులను నిలిపివేశారు. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా పనులు మొదలు కాకపోవడంతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించి పనులు త్వరతిగతిన పూర్తిచేశారు. దీంతో వెంకన్నహిల్స్, ప్రశాంత్‌నగర్, దత్తాత్రేయనగర్, న్యూవివేకానందర్‌నగర్, ప్రసన్ననగర్, ఎంఎన్‌రెడ్డినగర్, బ్యాంక్‌కాలనీ, సాయిబాబానగర్, రింగ్‌రోడ్డు, హెచ్ఏఎల్ రాఘవేంద్రాకాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే ఈ బ్రిడ్జి అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలియజేశారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

దుండిగల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా దుద్దెడ గ్రామానికి చెందిన నవీన్‌కుమార్(20), ప్రవీణ్‌కుమార్(20)లు స్నేహితులు. వీరిద్దరు ఉపాధి కోసం నగర శివారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని మల్లంపేటకు వలస వచ్చి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. గురువారం ఇద్దరూ ద్విచక్ర వాహనంపై ఉదయం 11:30లకు వెళుతుండగా మంజు వైన్స్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన వాటర్ ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు ఇద్దరిని గాంధీకి తరలించారు. చికిత్స పొందుతూ నవీన్‌కుమార్ సాయంత్రం మృతి చెందాడు. ట్యాంకర్ డ్రైవర్ ఘటన జరిగిన ప్రాంతం నుంచి పరారయ్యాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | పున్నారావు: 9985921366